నేడు యుటిఎఫ్ ధర్నా

శ్రీకాకుళం అర్బన్: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఎ ఎరియర్లు, సరెండర్ లీవులు, రిటైర్డ్ ఉద్యోగుల పిఎఫ్, ఇఎల్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యుటీ తదితర బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బకాయిలు సుదీర్ఘకాలంగా చెల్లించకపోవడం వల్ల ఉపాధ్యాయ, ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిఆర్‌సి చర్చల సందర్భంగా ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జాయిన్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఆర్థిక బకాయిలన్నింటినీ మార్చి 2022 నాటికి చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు బకాయిల విడుదలకు ఎటువంటి చర్యలు కనిపించలేదని పేర్కొన్నారు. ధర్నాకు ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.

వాయుగుండం గుబులు

- జిల్లాలో పలుచోట్ల ప్రారంభమైన వరి కోతలు
- పొలాల్లోనే కుప్పలు
- హడలెత్తిస్తున్న వాతావరణం
- ఆందోళనలో అన్నదాతలు

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అన్నదాతలను హడలెత్తిస్తోంది. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై టెన్షన్‌కు గురిచేసింది. మరోవైపు చలిగాలుల తీవ్రత బాగా పెరిగింది. కొన్నిచోట్ల చిన్నపాటి చినుకులూ పడడంతో రైతుల్లో కలవరం మొదలైంది. వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో వర్ష భయం వెంటాడుతుండడంతో ఏం చేయాలో వారికి తోచడం లేదు. కొన్నిచోట్ల పంట కోసి కుప్పలుగా పోశారు. వర్షం పడుతుందన్న వార్తల నేపథ్యంలో పంటను కాపాడుకునే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జి.సిగడాంలో రైతులు పెట్టిన కుప్పలు
(ఇన్‌సెట్‌లో పోలాకిలో వరి కుప్పపై రైతులు కప్పిన టార్పాలిన్)

జిల్లాలో ఈ ఏడాది 3,82,650 ఎకరాల్లో వరి పంట సాగు అయింది. అధికారుల అంచనా ప్రకారం 8.11 మెట్రిక్ టన్నుల ధాన్యం రావచ్చని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం అత్యధిక విస్తీర్ణంలో వరి కోతలు పూర్తి కాలేదు. కోసిన పంట కూడా పొలాల్లోనే ఉంది. వీటిని ఎక్కువ రోజులు కాపాడుకోవడం రైతులకు ఇబ్బందికరంగానే ఉంటుంది. హిరమండలం, ఎల్.ఎన్ పేట, జలుమూరు, సారవకోట, టెక్కలి, పోలాకి, సరుబుజ్జిలి, ఆమదాలవలస, జి.సిగడాం తదితర మండలాల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. మిగిలిన మండలాల్లోనూ కోతలకు సిద్ధమవుతున్నారు. వాతావరణంలో మార్పులతో కొన్నిచోట్ల కోతలకు వెనుకాడుతున్నారు. కోతలు పూర్తయిన చోట పొలాల్లోనే కుప్పలు వేసి ఉంచారు. సరిగ్గా ఈ దశలో ఆకాశంలో కమ్ముకున్న మేఘాలు అన్నదాత వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. ఈ దశలో ఏమాత్రం వర్షం కురిసినా పంటకు నష్టం తప్పదని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు.

మరోవైపు సాంకేతిక సమస్యలు

సాంకేతిక సమస్యలతో వేలాది ఎకరాల్లో ఈ-క్రాప్, ఇకెవైసి నమోదులో అనేక సమస్యలు తలెత్తాయి. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో 3,82,650 ఎకరాల్లో వరి సాగు అయింది. ఈ-క్రాప్, ఇకెవైసిలో 3,75,517.5 ఎకరాలు నమోదైంది. 7,132.5 ఎకరాలు నమోదు కాలేదు. వర్షంతో పంటకు నష్టం వాటిల్లితే వీరికి ఇన్సూరెన్స్ కూడా వచ్చే అవకాశం లేదు.

ప్రారంభం కాని ధాన్యం కొనుగోళ్లు

ధాన్యం కొనుగోళ్లకు జిల్లాలో పూర్తిస్థాయి ఏర్పాట్లు ఇంకా కాలేదు. అయినా ధాన్యం సిద్ధంగా ఉన్న చోట ఈనెల 19వ తేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభించాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. సిఎం పర్యటన నేపథ్యంలో కేంద్రాల ప్రారంభం వాయిదా పడింది. జిల్లాలో 272 మిల్లులు ఉండగా 166 మిల్లుల్లోనే ఫోర్టిఫైడ్ నాన్ సార్టెక్స్ యంత్ర సామగ్రి ఉంది. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రతి మిల్లరు ప్రభుత్వానికి బ్యాంకు గ్యారంటీ (బిజి) సమర్పించాల్సి ఉంది. ప్రభుత్వం అందించే ధాన్యం విలువలో తొలుత 33 శాతం బ్యాంకు గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఒక్క మిల్లరు కూడా బ్యాంకు గ్యారంటీ ఇవ్వలేదు. వారి బిజిలు ఇచ్చిన తర్వాతే అధికారులు మిల్లులకు ధాన్యం పంపుతారు. మరోవైపు ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెడుతున్న యాప్‌ను ఇంకా కొనుగోలు సిబ్బందితో డౌన్‌లోడ్ చేయించలేదు. కొనుగోళ్ల ప్రక్రియ కోసం అవసరమైన సిబ్బందిని కూడా పూర్తిస్థాయిలో నియమించలేదు.

కొనసాగుతున్న అన్నదాత కష్టాలు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లాలో మునుపెన్నడూ లేని రీతిలో సుడిదోమ పోటు పంటకు తీవ్ర నష్టం కలిగించింది. జిల్లాలో సుమారు 65 వేల ఎకరాల్లో వరి పంట నాశనమైంది. సాగునీటి సౌకర్యం లేక వేలాది ఎకరాలకు సాగునీరందని పరిస్థితి నెలకొంది. వంశధార కాలువ గట్టు బలహీనంగా ఉండడం, షట్టర్లు లేకపోవడంతో పలాస, టెక్కలి నియోజకవర్గంలోని శివారు గ్రామాలకు నీరందలేదు. కీలకమైన పొట్ట దశలో సుమారు 20 వేల ఎకరాల వరకు నీరందకపోవడంతో దిగుబడిపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జూన్, జులైలో తగినంతగా వర్షాలు పడకపోవడంతో, చాలా ప్రాంతాల్లో వరి పంట వేయలేదు. జిల్లాలో ఖరీఫ్‌లో 4,06,797.5 ఎకరాల్లో వరి పంట వేస్తారని అధికారులు అంచనా వేయగా 3,82,650 ఎకరాల్లో వరి వేశారు. మిగిలిన 24,147.5 ఎకరాల్లో వరి పంట వేయలేదు.

పట్టాలు ఇచ్చే వరకు పోరాటం

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

రైతులతో కలిసి ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలోని నారాయణ పురం భూ సాగుదారులకు పట్టాలు ఇచ్చే వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కె.మోహనరావు హెచ్చరించారు. నారాయణ పురం భూములను తరతరాలుగా సాగు చేస్తున్న దళితులు, బిసిలకు సాగు హక్కులు కల్పించి పట్టాలు ఇవ్వాలని కోరుతూ నారాయణపురం భూ పోరాట కమిటీ ఆధ్వర్యాన రైతులు నగరంలోని ఎన్‌జిఒ హోం నుంచి ప్రదర్శన నిర్వహించి కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణపురం రెవెన్యూ పరిధిలోని సుమారు 200 ఎకరాల భూమిని తరతరాలుగా చిలకపాలెంకు చెందిన ఎస్‌సి, బిసి కుటుంబాలకు చెందిన రైతులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో 2012 వరకు సాగుదారుల పేర్లు నమోదై ఉన్నాయన్నారు. ప్రభుత్వ అండతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై అడంగల్ నుంచి రైతుల పేర్లను తొలగించి తప్పుడు పాసు పుస్తకాలు సృష్టించారని తెలిపారు. రైతులకు అండగా ఉండాల్సిన అధికారులు, పోలీసులు కబ్జాదారులకే కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. తమ భూములను కాపాడాలని ఎచ్చెర్ల తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులు 190 రోజులు నిరాహార దీక్షలు, ధర్నాలు చేపట్టారని తెలిపారు. భూములు సర్వే చేసి నారాయణపురం భూ సాగుదారులకు పట్టాలు ఇచ్చి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కబ్జాదారులు ప్రభుత్వ అండతో ఆ భూముల్లో క్వారీ నిర్వహిస్తూ హద్దు రాళ్లు, జీడి, టేకు, నీలగిరి తోటలను తొలగిస్తున్నారని తెలిపారు. ఆ భూములకు ఆనుకుని ఉన్న ఆయుకట్టు చెరువులను కప్పివేస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని అనేకసార్లు తహశీల్దార్‌కు తెలియజేసినా ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. పంటలను ధ్వంసం చేస్తున్నారని, అడిగిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. ఈ భూములే తప్ప వేరే ఆధారం లేని పేదల భూములు లాక్కోవాలని చూస్తే సహించేది లేదన్నారు. ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి రమణ, ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి పొందూరు చంద్రరావు, నారాయణపురం భూ పోరాట కమిటీ నాయకులు తోనంగి నందోడు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిని తరిమికొట్టాలి

ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి - మందస

బాదుడే బాదుడులో పాల్గొన్న ఎంపీ, శిరీష

అన్ని రంగాల్లోనూ రాష్ట్రాన్ని అథోగతి పాల్జేసిన వైసిపి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. మందస మండలంలోని బాహడపల్లి పంచాయతీ, మండల కేంద్రంలో టిడిపి ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన బాదుడే బాదుడు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసిపి పాలన అంతా అవినీతిమయమని, ఎక్కడా చూసినా కొండలు, గుట్టలు, శ్మశానాలను ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. చెత్తపైనా పన్ను విధించడం వైసిపి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. మూడు రాజధానుల పేరుతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రాంతీయ విభేదాలు సృష్టించి పబ్బం గడుపుకుంటున్నారని ధ్వజమెత్తారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వం కొలువుదీరాక నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ఈ మూడున్నరేళ్లలో కనిపించిన ప్రతి దానికీ రంగులు వేయడం తప్ప రాష్ట్రాభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. ఎప్పుడో ఇచ్చిన ఇందిరా కాలనీలు, ఎన్‌టిఆర్ కాలనీలకు ఇప్పుడు ఒన్ టైమ్ సెటిల్‌మెంట్ చేస్తున్నారని దుయ్యబట్టారు.

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ అధికార పార్టీ, అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు రోడ్డు పైకి వస్తున్నారన్నారు. అవినీతి ప్రభుత్వంపై పోరాటానికి అంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించి, వైసిపి అవినీతి ప్రభుత్వానికి చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, ఎల్.కామేష్, బి.నాగరాజు పాల్గొన్నారు.

మత్స్యకారుల స్థితిగతులు మెరుగుపడాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సిఎం ప్రసంగాన్నివీక్షిస్తున్న కలెక్టర్,జిల్లా అధికారులు

జిల్లాలోని మత్స్యకారుల ఆర్థిక, జీవన స్థితిగతుల మెరుగుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో సిఎం పాల్గొన్న ప్రపంచ మత్స్యకార దినోత్సవ రాష్ట్రస్థాయి వేడుకలను కలెక్టరేట్ నుంచి వీక్షించారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారుల కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే మత్స్యకార భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పరికరాల పంపిణీ వంటివి మంజూరు చేస్తున్న సంగతిని గుర్తుచేశారు. మత్స్యకార విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పాఠశాల, కళాశాల కావాలని సంఘ సభ్యులు తెలిపారన్నారు. జిల్లాలో మత్స్యశాఖ మంత్రి ఉన్నారని, వారి ద్వారా మత్స్యకారులకు అవసరమైన వాటిని చేకూర్చే దిశగా చర్యలు చేపడతామన్నారు.

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ మాట్లాడుతూ జిల్లాలో మత్స్య సంపద ఎక్కువగా ఉన్నా మార్కెటింగ్ అవగాహనా లోపంతో మత్స్యకారులు అభివృద్ధి చెందడం లేదన్నారు. మత్స్యకారుల జీవితాలు మెరుగుపడేలా ఎం.ఎస్ స్వామినాథన్ కమిటీ ద్వారా మత్స్యకారులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రూ.21 లక్షల విలువ చేసే చేపల రవాణా చేసుకునే ద్విచక్ర వాహనాలు, ఐస్ బాక్సులను 28 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తొలుత పలు రంగాల్లో సేవలు అందించిన మత్స్య కార్పొరేషన్ డైరెక్టర్లు మైలపల్లి మహాలక్ష్మి, బర్రి తోటమ్మ, బెనియ విజయలక్ష్మి, బిఎస్‌ఎన్‌ఎల్ బోర్డు డైరెక్టర్ బడే రాంబాబు, రాష్ట్ర సాంస్కృతిక సమాఖ్య డైరెక్టర్ ఎల్.ఎర్రయ్య, వైస్ ఎంపిపిలు వంక రాజు, మైలపల్లి కామరాజు, కుందువానిపేట సూర్యం, డి.లక్ష్మయ్య తదితరులను కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో మత్స్య శాఖ సంయుక్త సంచాలకులు పి.వి శ్రీనివాసరావు, పలు మత్స్యకార సంఘాల ప్రతినిధులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి సంతోష వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వారోత్సవాలను ప్రారంభిస్తున్న విజయ కుమార్

ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యంగా ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు ప్రయాణికుల సంతోష వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ కుమార్ తెలిపారు. వారోత్సవాలను నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఎపిఎస్ ఆర్‌టిసి మొబైల్ యాప్, నెట్ బ్యాంకింగ్, యుపిఐ ద్వారా చెల్లింపులకు అవకాశం కల్పించామన్నారు. ప్రముఖ కూడళ్లలో ఆథరైజ్డ్ టికెట్ బుకింగ్ ఏజెంట్లను నియమించామని చెప్పారు. ప్రయాణికులు టికెట్ల కొనుగోలుకు దూర ప్రాంతం నుంచి బస్ స్టేషన్ వరకు రానవసరం లేదన్నారు. తిరుగు ప్రయాణం టికెట్లను బుక్ చేసుకున్న వారికి ప్రయాణ ఛార్జీలో పది శాతం రాయితీ కల్పించినట్లు తెలిపారు. దూర ప్రాంత సర్వీసులకు వెహికల్ ట్రాకింగ్ అందుబాటులో ఉందన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను పరిష్కరించేందుకు 24 గంటల పాటు ఆర్‌టిసి కాల్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఫిర్యాదుల కోసం 0866 2570005 నంబరును సంప్రదించాలని కోరారు. ప్రయాణికుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి స్టేషన్ సిబ్బంది, కార్మికులతో డిపో మేనేజర్లు గేట్ మీటింగులు నిర్వహించాలన్నారు. వాట్సాప్, మెయిల్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను పరిశీలించి, ఫిర్యాదులు అందిన 24 గంటల్లోగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2 డిపోల మేనేజర్లు మాధవ్, కె.ఆర్.ఎస్ శర్మ, ఎఎంటిలు రమేష్, గంగరాజు, ట్రాఫిక్ సూపర్‌వైజర్ ఎల్.ఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో భూ తగాదాల్లేని గ్రామాలు

ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - నరసన్నపేట

రాష్ట్రంలో భూ తగాదాలు లేని గ్రామాలను త్వరలోనే చూస్తామని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష (రీ సర్వే) పథకంలో భాగంగా జిల్లాలో భూ హక్కు పట్టాల పంపిణీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 23న శ్రీకారం చుడుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను పార్టీ ముఖ్య నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రెవెన్యూ మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో తొలిసారి జగ్గయ్యపేట తక్కెళ్ళపాడులో భూ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మొదటి విడతలో రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసుకున్నామని, రెండో విడతకు సంబంధించి నరసన్నపేట నియోజకవర్గంలో శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. రూ.వెయ్యి కోట్ల ఖర్చుతో రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, డిసిసిబి అధ్యక్షులు కె.రాజేశ్వరరావు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, ధర్మాన కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ దుకాణాలు సీజ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమల్లో భాగంగా నగరపాలక సంస్థ మార్కెట్ ప్రాంతంలో హోల్‌సేల్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ మెటీరియల్‌ను విక్రయిస్తున్న దుకాణాలపై అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు చేశారు. శ్రీలక్ష్మి టీ కంపెనీ, సుశీల ఎంటర్‌ప్రైజెస్, విజయ ప్లాస్టిక్స్, మీనాక్షి ప్లాస్టిక్స్ నగరపాలక సంస్థ కమిషనర్ దుకాణాలను సీజ్ చేశారు. అక్రమంగా నిషేధ ప్లాస్టిక్ నిల్వలు ఉంచిన దుకాణాదారులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జరిమానా విధించారు. నగరపాలక సంస్థ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉన్నందున ప్లాస్టిక్ కవర్ల స్థానంలో ప్రత్యామ్నాయంగా జనుము, గుడ్డ సంచులను ఉపయోగించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేస్తే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరావు, శానిటరీ సూపర్‌వైజర్ గణేష్, శానిటేషన్ సెక్రటరీలు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తున్న కమిషనర్ ఓబులేసు

దోమపోటుకు నష్టపరిహారం చెల్లించాలి

'స్పందన'కు 139 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఖరీఫ్‌లో దోమపోటు వల్ల వరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, రైతాంగాన్ని ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు కోరారు. జిల్లాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరితో కలిసి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ వినతులను స్వీకరించారు. జిల్లాలో నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్న నిరుద్యోగులను ఆదుకునేందుకు తక్షణమే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ను నాగార్జున ప్రతాప్ తదితరులు కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. ఉద్దానం తాగునీటి ప్రాజెక్టులో పనిచేస్తున్న పంపు ఆపరేటర్లు, మెకానిక్‌లకు తొమ్మిది నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, తక్షణమే జీతాలు చెల్లించాలని కోరుతూ పలువురు మెకానిక్‌లు ఫిర్యాదు చేశారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో నారాయణపురం కాలువ శివారు భూములకు సాగునీరందక పంటలు దెబ్బతింటున్నాయని పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు కలిశెట్టి అప్పలనాయుడు ఫిర్యాదు చేశారు. వీటితోపాటు పలు వ్యక్తిగత, సామాజిక సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా స్పందనలో వస్తున్న ఫిర్యాదులతో పాటు ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడంలో అలసత్వం తగదని జాయింట్ కలెక్టర్ నవీన్ హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో 1120 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 1002 ఫిర్యాదులు ఒక్క పౌరసరఫరా శాఖ వద్దే పెండింగ్‌లో ఉంచడానికి కారణాలు చెప్పాలని డిఎస్‌ఒ డి.వి రమణను ఆదేశించారు. తక్షణమే సంబంధిత సిబ్బందికి ఛార్జిమెమోలు జారీ చేయాలని డిఆర్‌ఒను ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయదేవి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిపిఒ రవికుమార్, ఐసిడిఎస్ పీడీ అనంతలక్ష్మి, అదనపు డిఎంహెచ్‌ఒ అనురాధ, డ్వామా పీడీ చిట్టిరాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ నవీన్

మండలానికి 2,500 మందికి 'ఉపాధి'

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - జలుమూరు

మండలంలో రోజుకు 25 వేల మందితో ఉపాధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు అధికారులను ఆదేశించారు. మండలం లోని సురవరంలో కమ్యూనిటీ బ్లాక్ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన 200 కొబ్బరి మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు గరిష్ట కూలి రూ.275 వచ్చేలా పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ సిహెచ్.నారాయణరావు, ఇసి అప్పలస్వామి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

కొబ్బరి మొక్కలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

స్థానిక నాయకులదే జన సమీకరణ బాధ్యత

రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

నరసన్నపేట: ఈనెల 23న సిఎం పర్యటనకు సంబంధించి జన సమీకరణ బాధ్యత స్థానిక నాయకులకు అప్పగించాలని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సిఎం పర్యటనపై మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 12 వేల మంది రైతులతో సిఎం సభను నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి బస్సు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. గంటన్నరలో కార్యక్రమం మొత్తం అయిపోతుందని, రైతులు చివరకు వరకు ఉండాలన్నారు. హెలీప్యాడ్ ఏర్పాటు చేసిన జమ్ము నుంచి నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సభా ప్రాంగణం వరకు సిఎంకు స్వాగతం చెప్పే విధంగా ఉంటే ఇంకా బాగుంటుందని చెప్పారు. ఎక్కువ గ్రామాల్లో భూ సమగ్ర సర్వే పూర్తయిన నియోజకవర్గం నరసన్నపేట మాత్రమేనని, అందుకే ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. భూ సర్వేను అప్పటి రెవెన్యూ మంత్రి ధర్మాన కృష్ణదాస్ వేగవంతం చేయించారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, గొర్లె కిరణ్ కుమార్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఈ నెల 23న జిల్లాలోని నరసన్నపేట నియోజకవర్గంలో పర్యటించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వైఎస్ఆర్, జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష (రీ సర్వే) పథకంలో భాగంగా జిల్లాలో భూ రికార్డుల పంపిణీకి సిఎం శ్రీకారం చుడుతున్నారని అన్నారు. భూ యాజమాన్య హక్కులు, రీ సర్వే రెండో దశ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు భూ వివాదాల జోలికి పోయేందుకు సాహసించలేదని అన్నారు. సిఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత వాస్తవిక హక్కుదారులకు తమకు చెందే భూములు న్యాయ బద్ధంగా అనుభవిస్తున్నారని అన్నారు. వ్యవసాయాన్ని బలోపేతం చేసేందుకు, రైతులకు మేలు జరిగే కార్యక్రమాలు ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో సిఎంకు సాదర స్వాగతం పలికేందుకు రైతులు, రైతు సంఘాలు, విద్యార్థులు, యువత నరసన్నపేట తరలిరావాలని పిలుపునిచ్చారు.

నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న రాజు

750 మందికి పుస్తకాలు పంపిణీ

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యాన కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 750 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అరబిందో ఫార్మా ప్రతినిధులు యు.బి.ఎస్.రాజు మాట్లాడుతూ అరబిందో ఫార్మా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, తాగునీటి సరఫరా, విద్య, వైద్య సదుపాయాలు కల్పనకు అరబిందో ఫార్మా సిఎస్ఆర్ నిధులను వెచ్చిస్తున్నట్లు తెలిపారు. గతంలోనూ ఈ పాఠశాలకు ఆటస్థలం ప్రాంగణం ప్రహరీ నిర్మించామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కార్పొరేట్ హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్ ఎన్.ఆర్.రాజారెడ్డి, సీనియర్ జనరల్ మేనేజర్ కమలాకర్‌రెడ్డి, పైడిభీమవరం మాజీ సర్పంచ్ లంకలపల్లి ప్రసాదరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జిఒ 52ను తక్షణమే రద్దు చేయాలి

పలాస: భావితరాల గిరిజనుల భవిష్యత్ కోసం జిఒ 52 రద్దయ్యేవరకు ప్రతి ఒక్కరూ పోరాడాలని ఆదివాసీ సంఘాల ఐక్య పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని లొత్తూరు పంచాయతీలోని గిరిజన గ్రామంలో ఆ సంఘం అధ్యక్షులు సవర రాంబాబు ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బోయ, వాల్మీకి, నకిలీ బెంతు ఒరియాలను గిరిజన జాబితాలో చేర్చవద్దని డిమాండ్ చేశారు. జెసి శర్మ ఏకసభ్య కమిషన్ నివేదిక బహిర్గతం చేయాలని కోరారు. ఏ ఇతర కులాలను గిరిజన జాబితాలో చేర్చకూడదని ప్రభుత్వానికి హితవుపలికారు. రాష్ట్ర సభ్యులు మోహన రావు, ఎంప్లాయిస్ యూనియన్ పలాస మండల అధ్యక్షులు పి.ఈశ్వర రావు, సభ్యులు వెంకటేష్, లొత్తూరు పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి సిమోన్, సవర మోహనరావు, సవర భీమారావు, గణపతి, బసవసాయి, సర్పంచ్ ప్రతినిధి బాబూరావు, బెండమని, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జగన్నాయకులు

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

నౌపడ : మాట్లాడుతున్న దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి -నౌపడ

మత్స్యకారులు అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. సోమవారం సంతబొమ్మాళి మండలం ఎం.సున్నాపల్లి గ్రామంలో మత్స్యకార సామాజిక సంస్కృతి సమితి అధ్యక్షులు సూరాడ జోగారావు, గ్రామ సర్పంచ్ తయ్యి నారాయణ అధ్యక్షతన ప్రపంచ మత్స్యకార దినోత్సవం నిర్వహించారు. ముందుగా వీధుల్లో సముద్రం మా జీవనం తీరం, మా హక్కు అంటూ' నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో దువ్వాడ మాట్లాడుతూ మత్స్యకారులు చేపలు నిలువ చేయడానికి శీతల గిడ్డంగులు ఏర్పాటు చేస్తామని అన్నారు. జగన్నాథపురంలో మినీ జెట్టీ ఏర్పాటు కోసం కృషి చేస్తానని అన్నారు. మత్స్య కారులకు సబ్సిడీపైన వలలు, తెప్పలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం దివ్వల మాధురి ట్రూప్ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంపిపి మేరుగు రాజేశ్వరి, జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, ఎన్.భీమారావు, కనకరాజు, దామోదర్, లండ రుద్రమూర్తి, మైలపిల్లి శ్రీనివాసరావు, జోగి రాములమ్మ, టి.కృష్ణమూర్తి, సూరాడ వెంకటేష్, గోపీనాథ్ బెహరా, సూరాడ రాజారావు, కొండ భీమారావు, వంక కొర్లయ్య, మత్స్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా జనసేన

కవిటి: జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి మత్స్యకారుల సమస్యలపై పోరాడుతూ, మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తోందని జనసేన పార్టీ ఇచ్ఛాపురం నాయకుడు లోళ్ల రాజేష్ అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవ సందర్భంగా స్థానిక లోళ్ల నారాయణమూర్తి కళ్యాణ మండపంలో స్థానిక మత్స్యకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో మత్స్యకారులు ఉన్నా వాళ్లకు కనీస వసతులు లేక వలసపోతున్నారని అన్నారు. వేటకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో మత్స్యకారులు ఆర్థిక సమస్యలతో కొట్టమిట్టాడుతున్నారని అన్నారు. అనంతరం మత్స్యకారులు బడే రామ్మూర్తి, బడే భీమరాజు, మూస కూర్మారావులను సన్మానించారు. కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఐక్యతకు కృషి

పలాస: మత్స్యకారుల ఐక్యతకు, సంక్షేమానికి మత్స్యకార ఐక్యవేదిక కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కొమర దేవరాజు అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సంధ్బంగా సోమవారం లేబర్ కాలనీ, శ్రీ మంకినమ్మ గుడి అవరణలో ముందుగా మంకినమ్మ తల్లికి పూజలు చేశారు. మత్స్యకారులు ఐక్యత వర్థిల్లాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం లేబర్ కాలనీలో ఉన్న పేదలందరికీ ఐక్యవేదిక తరుపున దుప్పట్లు పంపిణీ చేసారు.. ఈ కార్ర్యమానికి మత్స్యకార నాయకులు అంబటి ఆనంద, బొంపల్లి శ్రీనివాస్, నెయ్యల భగీరథ, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

సోంపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక

టిడిపి పాలనలో మత్స్యకారుల అభివృద్ధి

సోంపేట: సిఎంగా చంద్రబాబు ఉన్న సమయంలోనే రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధి జరిగిందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. మండలంలోని రామయ్యపట్నం లో సోమవారం మత్స్యకార దినోత్సవం సందర్భంగా తీర ప్రాంత మత్స్యకార ఐక్యవేదిక ఆధ్వర్యాన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పిరియా సాయిరాజ్ జ్యోతిప్రజ్వళన చేసి కార్య్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఐక్యవేదిక జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి హయాంలో మత్స్యకారుల ఎనలేని అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు, రాష్ట్ర గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ నర్తు రామారావు, మత్స్య కార్పొరేషన్ డైరెక్టర్ రాజారావు, మత్స్యకార నాయకులు సూరడ చంద్రమోహన్, బట్టి మాధవరావు, బడే తమ్మారావు, నిట్ట గోపాల్, వాసుపల్లి కృష్ణ, కాయ భీమేష్, జికె.నాయుడు, ఎస్ఐ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సులను క్రమబద్ధీకరించాలి

వినతిపత్రం అందజేస్తున్న స్టాఫ్‌నర్సులు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా కేంద్రంలోని సర్వజనాస్పత్రిలో కాంట్రాక్టు ప్రాతిపదికన నియమితులైన స్టాఫ్‌నర్సులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ మేరకు మంత్రి క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కాంట్రాక్టు సర్వీస్‌న నియమించి పదేళ్లు పూర్తి చేసిన వారిని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రోస్టరు పాయింట్ల ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఉన్న వారికి క్రమబద్ధీకరించనున్నారని తెలిపారు. దీంతో కాంట్రాక్టు స్టాఫ్ సర్వీసులో ఉన్న వారికి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు స్టాఫ్‌నర్సస్‌లో ఏ ఒక్కరూ పదేళ్ల కాంట్రాక్టు సర్వీస్‌లో నిండిన వారు లేరని అన్నారు. ఎన్ఎచ్ఎం, ఎపిఎస్ఎస్ఎస్, ట్రామాకేర్, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో డిఎస్‌సి విధానాన్ని అనుసరించి ఎంపిక ప్రక్రియ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఖరారు చేశారని పేర్కొన్నారు. అప్పటి నుంచి తాము సర్వీస్ చేసి ఇప్పుడు ప్రభుత్వ కాంట్రాక్టు విధానంలో ప్రవేశించామని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ పరిసర ప్రాంతాల్లో స్టాఫ్ నర్సులు ముఖ్యమైన భూమిక అని, రోగికి వైద్యం నుంచి సంరక్షణ వరకూ పూర్తి బాధ్యత స్టాఫ్‌నర్సే వహిస్తారని వివరించారు. కోవిడ్ వంటి మహమ్మారి సమయంలో రోగికి దగ్గరగా ఉండి నిరంతరం సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఉత్తర్వులను అనుసరించి కాంట్రాక్టు ప్రాతిపదికన స్టాఫ్‌నర్సులను క్రమబద్ధీకరించాలని కోరారు. వినతిపతం అందించిన వారిలో కె.వేదవతి, ఎన్.ఆశాదీపిక, టి.స్రవంతి, హబీబా, ఎస్.సుజాత, జి.ఝాన్సీ, గాయత్రి, సౌమ్యశ్రీ, సోమేశ్వరి పాల్గొన్నారు.

ప్రజా చైతన్యంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

శ్రీకాకుళం అర్బన్ : ప్రజలు చైతన్యవంతమైతేనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రామకృష్ణారెడ్డి, కె.ప్రసాద్ స్పష్టం చేశారు. నగరంలోని విద్యాధరి డిగ్రీ కళాశాలలో వేదిక జిల్లాస్థాయి ప్రథమ మహాసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల్లో నిజాయితీ కొరవడడంతో నిజమైన ప్రజాసామ్యం అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభల నిర్వాహణతోనే క్షేత్రస్థాయిలో పారదర్శక పాలన సాధ్యమన్నారు. ప్రజల్లో సమూల మార్పులు రావాలంటే ముందుగా ప్రజలు ఆలోచన శక్తిని, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. గ్రామసభల నిర్వాహణ, సమాచార హక్కుచట్టం సద్వినియోగం చేయడంలో క్రియాశీల సభ్యులు సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా వేదిక ఆధ్వర్యాన శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మందపల్లి రామకృష్ణారావు, ఉంగటి వెంకటరమణ, కోశాధికారిగా బి.వి.రమణమూర్తి, ఉపాధ్యక్షులుగా పి.వెంకటరావు, వి.టి.నాయుడు, శ్రీహరి, సహాయ కార్యదర్శులుగా ధర్మారావు, రాజేష్, బి.పురుషోత్తం, కార్యవర్గ సభ్యులుగా ఎం.రవికుమార్, లక్ష్మణరావు, మురళీమోహన్, భార్గవకుమార్, పి.విజయలక్ష్మి తదితరులు ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి వి.సన్యాసిరావు, డాక్టర్ బాడాన దేవభూషణరావు, ఎం.కె.మిశ్రో పాల్గొన్నారు.

దుప్పట్లను పంపిణీ చేస్తున్న హెచ్ఎం శ్రీనివాసరావు

ఆశ్రమ పాఠశాలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- నందిగాం

చలికాలంలో విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ ఏటా వసతిగృహ విద్యార్థులకు దుప్పట్లను అందిస్తోంది. అందులో భాగంగా మండలంలోని జయపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 150 మంది విద్యార్థులకు సోమవారం హెచ్ఎం డి.శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దీపక్‌కు హెల్మెట్‌ను బహుకరిస్తున్న జనసేన నాయకులు

కవిటి చేరిన బైక్ యాత్ర

ప్రజాశక్తి - కవిటి

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ వరంగల్ జిల్లాకు చెందిన జి.దీపక్ వరంగల్ నుంచి ఇచ్ఛాపురం వరకు బైక్ యాత్ర చేపట్టాడు. సోమవారం కవిటి చేరుకున్న దీపక్‌కు జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ ఆహ్వానం పలికారు. అనంతరం శాలువతో సన్మానించి, హెల్మెట్ బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా దీపక్ మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లే, జన సైనికులను ఉత్తేజపరుస్తూ, పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిగా చేయడమే తన లక్ష్యమని తెలిపారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ పవన్ ఆశయం, ఆకాంక్షలకు అనుగుణంగా జన సైనికులందరూ పనిచేసి ఆయన ఆశయాన్ని నెరవేరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక జన సైనికులు పాల్గొన్నారు.

బియ్యం ప్యాకెట్లు, నగదు అందిస్తున్న గోవిందరావు

బాధితులకు 'ఎంజిఆర్' వితరణ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని వెంకటాపురం పంచాయతీ ఎగువబందపల్లిలో శనివారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో తొమ్మిదిళ్లు దగ్ధమయ్యాయి. దీంతో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను సోమవారం సామాజికవేత్త, తెలుగుదేశం పార్టీ నాయకుడు మామిడి గోవిందరావు సోమవారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం ప్యాకెట్లు, దుప్పట్లు, దుస్తులు, రూ.వెయ్యి నగదు చొప్పున అందించారు. ఇళ్లు నిర్మించుకుంటే తనవంతు సహాయాన్ని అందిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, కె.రామస్వామి, జి.శ్రీను, భైరాగి, నాయుడు, కృష్ణమాచారి, శ్రీధర్, దశథర, ప్రతాప్, మురళి పాల్గొన్నారు.

హిరమండలం : మండలంలోని కల్లటలో కార్తీక మాసం నాలుగో సోమవారం కారణంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సామాజిక వేత్త, టిడిపి నాయకులు మామిడి గోవిందరావు పాల్గొని అన్నదానానికి రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. గ్రామస్తులకు ఏ అవసరం వచ్చినా తనను సంప్రదిస్తే ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంజిఆర్ యువసేన అధ్యక్షులు పోతురాజు శ్రీధర్, పైల శాంతారావు, కలిశెట్టి వేణుగోపాల్, కొవిలాపు కృష్ణమాచార్య పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : 1098 ఆకృతిని ప్రదర్శించిన విద్యార్థులు

బాలల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జ్ఞాన భారతి విద్యాసంస్థలో కార్యదర్శి జోహార్‌కాన్ ఆధ్వర్యాన బాలల హక్కులపై చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్ జాస్మిన్ కుమారి సోమవారం అవగాహన కల్పించారు. జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, భాగస్వామ్యం పొందే హక్కు, అభివృద్ధి హక్కులపై అవగాహన కల్పించారు. బాలలపై లైంగిక దాడుల గురించి అవగాహన కల్పించారు. చైల్డ్ లైన్ చేస్తున్న చర్యలపై పూర్తిగా అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో చైల్డ్‌లైన్ 1098 ఆకృతి ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమ లో ఝాన్సి, సంతోష్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పలాస: బాల, బాలికల అక్రమ రవాణా, వేధింపులతోపాటు వారి హక్కుల సంరక్షణ కోసం చైల్డ్ లైన్ సంస్థ సామాజికంగా పని చేస్తోందని సిహెచ్ శ్రీనివాసరావు అన్నారు. చైల్డ్ లైన్ వారోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం పలాస మండల పరిషత్ కార్యాలయం పరిధిలోని భవిత స్కూల్‌లో చైల్డ్ లైన్ సే దోస్తీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా చైల్డ్ లైన్ సభ్యులు ప్రత్యేక అవసరాలగల పిల్లల వేధింపుల నివారణపై అవగాహన కల్పించారు. చైల్డ్‌లైన్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శివాజీ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లల కోసం తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ టీం మెంబెర్స్ డి.రమ, డి.జగదీశ్వరీ, కె.సునీత, పాఠశాల ఐఇఆర్ ఉపాధ్యాయులు బి.రవి శ్రీనివాసరావు, అప్పలరాజు, శేషగిరిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ అధికారులకు సన్మానం

ప్రజాశక్తి- నౌపడ

నౌపడ శాఖ గ్రంథాలయాధికారి బి.రూపావతిని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమారరారా, గ్రంథాలయ చైర్‌సర్సన్ సువ్వారి సువర్ణ ఘనంగా సత్కరించారు. 55వ వార్షికోత్సవం సందర్భంగా గ్రంథాలయంలో ఆయన చేస్తున్న సేవలకు గుర్తించి ఆమెను అభినందించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శంకరరావు, గ్రంథ పాఠకులు పాల్గొన్నారు.

లావేరు : గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావుకు గ్రంథాలయ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమారరాజాలు సన్మానించారు.

రూపావతిని సత్కరిస్తున్న కుమారరాజా, సువర్ణ

'కాకినాడ ఆదిత్య'లో గ్రంథాలయ వారోత్సవాలు

బహుమతులను అందజేస్తున్న సువర్ణ

శ్రీకాకుళం అర్బన్ : నగరంలో కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. సోమవారం వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ పాల్గొని వ్యస్థాపకులు రంగనాథం చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక విజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందినా గ్రంథాలయాల ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. పుస్తక పఠనం ప్రతి విద్యార్థీ అలవాటుగా మార్చుకోవడం ద్వారా ఉన్నతికి చేరగలరన్నారు. భవిష్యత్ తరాలకు విజ్ఞాన సమాచారాన్ని అందించడానికి గ్రంథాలయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణు గోపాలరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల గ్రంథాలయ అధికారి పి.కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ పిఒ నాగభూషణరావు, మధు పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సువర్ణ బహుమతులను అందజేశారు. అలాగే ఆమెకు కళాశాల యాజమాన్యం తరపున దుశ్శాలువ కప్పి సన్మానించారు.

న్యాయం చేయాలి

ప్రజాశక్తి- పర్లాకిమిడి

గజపతి జిల్లా కాశీనగర్ సమూహ ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల గత బుధవారం మాలతికుమారి మృతి చెందిందని బంధువులు ఆరోపించారు. ఈ మేరకు తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం ఆస్పత్రి ఆవరణలో నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మృతురాలి మాలతి సోదరులు హేమంత్ నాయక్, శివప్రసాద్ నాయక్, సుమంత్ నాయక్ మాట్లాడుతూ అనారోగానికి గురికావడంతో ఆస్పత్రిలో చేర్పించామన్నారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి పర్లాకిమిడి ఆస్పత్రికి రిఫర్ చేశారని, అక్కడి వైద్యులు పరీక్షించగా... అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారని అన్నారు. కాశీనగర్ వైద్యులు, స్టాఫ్‌నర్సులు నిర్లక్ష్యంగా వైద్య అందించడంతో మాలతికుమారి మృతి చెందిందని ఆరోపించారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం చెల్లించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కొరటాం వార్డు సభ్యులు సునిల్ పట్నాయక్, సామాజిక కార్యకర్తలు ఎ.రోజారాణి, బి.సుజత, సునిల్ పట్నాయక్, ప్రజా సంఘాల నాయకుడు పైల మురళి, బిజెడి కాశీనగర్ బ్లాక్ అధ్యక్షులు, సియలి పంచాయితీ సర్పంచ్ సంఘీభావం తెలిపారు. అనంతరం జిల్లా వైద్యాధికారి పి.కె.పండ ఆస్పత్రిలో చర్చించారు. దర్యాప్తు చేపట్టి మలతికుమారి కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని తెలిపారు.

నిరాహార దీక్ష చేస్తున్న మృతురాలి కుటుంబసభ్యులు

కణితివూరులో సత్యమమ్మ అంత్యక్రియలు

తిలక్‌కు ప్రముఖుల పరామర్శ

ప్రజాశక్తి- నందిగాం

ఎపి కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ తల్లి సత్యమమ్మ (78) ఆదివారం రాత్రి మృతిచెందిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం స్వగ్రామం కణితివూరులో ఆమె అంత్యక్రియలు బంధువులు, కుటుంబసభ్యులు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. సత్యమమ్మ భర్త సన్యాసినాయుడు ఇదివరకే మృతిచెందగా, ఆమెకు ఆనందరావు, యుగంధర్, తిలక్, రమేష్, కుమార్తెలు మీనాక్షి, ఉష ఉన్నారు. ఆమె మృతదేహాన్ని ఇంటి వద్ద సందర్శనార్థం ఉంచారు. అనంతరం చిన్నకుమారుడు అంత్యక్రియలు నిర్వహించారు. సత్యమమ్మ అంత్యక్రియల్లో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు (ఇన్‌సెట్)లో సత్యమమ్మ (ఫైల్)

కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, నాలుగు మండలాల కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తికల్‌ను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కోటబొమ్మాళి: పేరాడ తిలక్ తల్లి సత్యమమ్మ అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, సీనియర్ నాయకులు అన్నెపు రామారావు, పేడాడ వెంకటరావు సోమవారం తిలక్‌ను, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అమె మృతికి గల కారణాలు తెలుసుకొన్నారు. అమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో యలమంచిలి ఎంపిటిసి హనుమంతు గోవింద, నేతింటి సింహాచలం, సింగుపురం వినోద్, కాళ్ల గణపతి, తదితరులు ఉన్నారు.

శ్యామలరావు మృతి తీరనిలోటు

చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న రూప్‌సుందర్

ప్రజాశక్తి - పలాస

తెలగ కుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులుగా పనిచేస్తూ ఎన్నో సేవలందించిన చెన్నూతల శ్యామలరావు మృతి తీరనిలోటు అని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రొక్కం సూర్యప్రకాష్, పలాస అధ్యక్షులు శీలం రూప్ సుందర్ అన్నారు. కాశీబుగ్గలో సోమవారం శ్యామలరావు సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా, చిరునవ్వుతో పలకరించే వ్యక్తి అని, ఎలాంటి సహాయం కావాలన్న నేను ఉన్నాను అని ముందుకొచ్చి సహాయం చేసే వ్యక్తి శ్యామలరావు అని కొనియాడారు. ఆయన అకాల మరణం అందరకీ బాధాకరమని అన్నారు. మాజీ జెడ్‌పిటిసి సభ్యులు హరిప్రసాద్ మాట్లాడుతూ ఆయన అజాతశత్రువు అని అన్నారు. సమావేశంలో ఎంపిటిసి గున్నయ్య, వాసు, బాబ్జి, లోకు, బి.శ్రీనివాస్, ప్రతాప్, మన్మథరావు, రమేష్, రాజు, మూర్తి, జీవి తదితరులు పాల్గొన్నారు.

కలలన్నీ కల్లలైపోయాయి

చెరువులో జారిపడి సచివాలయ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి- పొందూరు

మోహన్ (ఫైల్)

నిరుపేద కుటుంబం వారిది. ఎన్నో ఏళ్లుగా తమ కులవృత్తిని చేసుకుంటూ చాలీచాలని డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటూనే కుమారులను ఉన్నతంగా చదివించారు. కుమారులు ప్రయోజకులయితే తమ జీవితాలు మారుతాయని అనుకున్నారు ఆ తల్లిదండ్రులు. అందుకు తగ్గట్టుగానే చిన్నవయసులోనే కుమారునికి ఉద్యోగం రావడంతో ఇకపై తమ కష్టాలు తీరనున్నాయనుకున్నారు. ఇంతలో వారి ఆనందానికి అవదలు లేకుండాపోయింది. చెరువురూపంలో కుమారుడిని మృత్యువు కబలించడంతో ఆదుకుంటాడనుకున్న కొడుకు అనంతలోకాలకు వెళ్లిపోయాడని, తాము కన్న కలలన్నీ కల్లలైపోయాంటూ కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు.

మండల కేంద్రంలోని కాశీవిశ్వేశ్వర ఆలయం వద్ద ఉన్న చెరువుకు రోజులానే సోమవారం ఉదయమూ గోరు మోహన్ (21) స్నానానికి వెళ్లాడు. ఇంతలో కాలు జారడంతో లోపలకు జారిపోవడంతో మునిగిపోయాడు. దీనిని గమనించిన స్థానికులు వెంటనే దిగి బయటకు తీసి స్థానిక ప్రభుతాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృుతుడిది సంతకవిటి మండలం బొద్దూరు. సచివాలయం ఎనర్జీ అసిస్టెంట్‌గా ఎంపికై లావేరు మండలం గుర్రాలపాలెంలో బాధ్యతలను నిర్వహిస్తున్నాడు. మృతుడు పొందూరులోని లావేటి వీధిలో ఉన్న తన తాతయ్య అల్లాడ అప్పారావు వద్ద ఉండి రోజూ విధులకు వెళ్తున్నాడు. మృతుడి తల్లిదండ్రులు చిన్నారావు, కుమారిలు స్వగ్రామంలో చేనేత వృత్తిని చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమారులు. కాగా పెద్దకుమారుడికి ఉద్యోగం రావడంతో తాత ఇంటి నుంచి పనిచేసే గ్రామం దగ్గరగా ఉంటుందని, ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తున్నాడు. దీనిపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘటనా స్థలంలో క్షతగాత్రులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నౌపడ: సంతబొమ్మాళి మండలం టెక్కలి-నౌపడ రహదారి నౌపడ రైల్వే గేటు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడగా, మరో ఇద్దరు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. నౌపడ ఆర్ఎస్‌కు చెందిన ఆర్ఎంపి డాక్టర్ ఎస్.ఎం.భాష రహదారిపై సోమవారం సాయంత్రం వాకింగ్ చేస్తున్నాడు. అదే మార్గంలో నౌపడ నుంచి టెక్కలి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఆర్.సున్నాపల్లికి చెందిన బొంగు గవరరాజు, జనపాన వసంత్ బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో భాష తల, శరీర భాగాలకు తీవ్ర గాయమైంది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 సహాయంతో వారిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. భాషను మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. సంతబొమ్మాళి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభంపై నుంచి జారిపడి..

పలాస: మండలంలోని పుల్రియ గ్రామానికి చెందిన సవర సుమంత్ కాశీబుగ్గలో సోమవారం విద్యుత్ పనులు చేసేందుకు వెళ్లాడు. విద్యుదాఘాతంతో ఒక్కసారిగా స్తంభంపై నుంచి జారిపడటంతో గాయపడ్డాడు. స్థానికులు 108లో క్షతగాత్రుడ్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం క్షేమంగా ఉన్నట్లు ప్రభుత్వ వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుమంత్

సంక్షేమ పథకాలను వివరిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

గడప గడపకూ సంక్షేమ పాలన

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి- కవిటి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో గడప గడపకు సంక్షేమ పాలనను అందిస్తున్నట్లు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ తెలిపారు. సోమవారం సాయంత్రం బెలగాంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎటువంటి అవినీతి లేకుండా, ఎవరి సహకారం లేకుండా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలితాలు అందించిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదని కొనియాడారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సచివాలయ సిబ్బంది పనితీరు, వాలంటీర్ల పనితీరు, వారికి అందుతున్న సంక్షేమ ఫలాలు గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, కవిటి, కంచిలి ఎంపిపిలు కడియాల పద్మ ప్రకాష్, దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ మద్దిలి అన్నపూర్ణ, సర్పంచ్ ప్రతినిధి ఎం.ఈశ్వరరావు, మండలంలోని పలువురు అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కూర్మారావు

'మధ్యాహ్న భోజనం' పరిశీలన

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించే జగనన్న గోరుముద్ద పథకంలో సోమవారం నుంచి కొత్త మెనూ పాటించాలని మండల విద, సంక్షేమాధికారి పైడి కూర్మారావు సిబ్బందికి సూచించారు. మండలంలోని వెదుళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకాన్ని ఎంఇఒ దుప్పల రామారావుతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం సర్పంచ్ సురేష్, విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంతమంది న్యూట్రిషన్ నిపుణులు పిల్లల సూచనల మేరకు ప్రభుత్వం మెనూను మార్చిందని తెలిపారు. నాడు-నేడు పనుల పురోగతిని పరిశీలించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కన్వీనర్ బొడ్డేపల్లి ఈశ్వరరావుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు బి.రమణమూర్తి పాల్గొన్నారు.

వాలంటీరు పోస్టులకు దరఖాస్తులు స్వీకరణ

పొందూరు: మండల పరిధిలోని కనిమెట్ట, పొందూరు, మలకాం గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వాలంటీరు పోస్టులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపిడిఒ సీపాన హరిహరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కనిమెట్టలో ఒకటి, మలకాంలో ఒకటి, పొందూరులో మూడు వాలంటీర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 22 లోగా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ వసంతస్వామి

ఉపాధి హామీతో వలసల నివారణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గ్రామీణ ప్రాంతం నుండి వలసల నివారణకు ఉపాది హామీ చట్టం కింద పనులు కల్పిస్తున్నట్లు పిఎంపురం సర్పంచ్ గొరకల వసంతస్వామి అన్నారు. సోమవారం పిఎం.పురం, కాగితబందలో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనులు ఎంతో ఉపయోగంగా ఉన్నాయన్నారు. చెరువు పనుల వల్ల చెరువుల్లో నీటి నిల్వల సామర్థ్యం పెరిగి పంట పొలాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ పనులను ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జి.విశ్వనాథం, ఫీల్డ్ అసిస్టెంట్ అంగ కుశన్న, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి - పలాస

ఆర్థిక సహాయం అందజేస్తున్న సభ్యులు

పలాసకు చెందిన సకలాబత్తుల గిరిబాబు పలు దినపత్రికల్లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసేవాడు. కరోనా సమయంలో ఉద్యోగం లేక, కుటుంబం గడవటం కష్టంగా మారింది. ఆరోగ్య పరమైన బాధలతో జీవనం గడుపుతున్నాడు. విషయం తెలుసుకున్న బ్రాహ్మణతర్లా హెల్పింగ్ వారియర్స్ సభ్యులు ఆయనకు అండగా నిలిచారు. రూ.ఏడు వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో తిరుమల, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

హరివిల్లు కనువిందు

టెక్కలి : మండలంలోని అయోధ్యాపురం వద్ద సోమవారం ఏర్పడిన హరివిల్లు కనువిందు చేసింది. అల్పపీడనం కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. హరివిల్లును చూసి ప్రజలు ఆనందించారు.

కనువిందు చేసిన హరివిల్లు

అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ 'కూన'

వైసిపి నాయకులు చింతాడ రవి

ప్రజాశక్తి- ఆమదాలవలస

భూమి పత్రాలను చూపిస్తున్న చింతాడ రవి

అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రాస్ టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అని వైసిపి నాయకుడు చింతాడ రవికుమార్ అన్నారు. పట్టణ శివారు ఉన్న ఫ్లైఓవర్ వద్ద ఉన్న వైఎస్ విగ్రహం వద్ద కూన రవికుమార్ అవినీతి, భూ కబ్జాలు, ఇసుక తదితర వాటికి సంబంధించిన వివరాలను ఫ్లెక్సీల రూపంలో సోమవారం ఏర్పాటు చేసి ఆక్రమణల భూమి పత్రాలను చూపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వందలాది మంది ప్రజల సాక్షిగా, పట్టణ నడిబొడ్డున కూన రవికుమార్ భూకబ్జాలు, ఇసుక దందాలు అవినీతి బట్టబయలైందని అన్నారు. తాను విసిరిన బహిరంగ చర్చకు ఎవరూ రాకుండా తోకముడిచారని ఎద్దేవా చేశారు. కూన రవికుమార్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన భూకబ్జాలు, ఇసుక దందాలు ఆధారాలతో సహా తన వద్ద ఆధారాలు ఉన్నాయని అన్నారు.

విశాఖపట్నం సిటీ మధ్యలోని కప్పరాడు రెవెన్యూ సర్వే నంబరు 9/5లో అక్రమంగా రూ.200 కోట్లు విలువ ఉన్న 2.5 ఎకరాల కొండను తవ్వి ఆక్రమించారని అన్నారు. అలాగే సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలోని 102 ఎకరాల ప్రభుత్వ భూమిలో 50 ఎకరాల భూమిని కూన రవికుమార్ పేరు మీద, మరో 50 ఎకరాలు తన భార్య ప్రమీల పేరు మీద రాయించుకున్నారని అన్నారు. ఎకరా రూ.రెండు లక్షల చొప్పున కూన వారి పూల తోట కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. అప్పట్లో తాను ప్రజాక్షేత్రంలో, న్యాయస్థానంలో పోరాటం చేసి ఆ భూమిని కాపాడానని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చిగురుపల్లి రవికుమార్, ముద్దాడ ఈశ్వరరావు, బత్తుల లక్ష్మణరావు, ధవళ శ్యామ్, దానేటి రామ్మోహన్‌రావు, గురుగుబెల్లి తేజేశ్వరరావు, దూబ సురేష్‌కుమార్, కెప్టెన్ రామారావు, గురుగుబెల్లి తులసీరావు, బొడ్డేపల్లి నర్సింగరావు, సైరిగాపు శ్రీనివాసరావు, గురుగుబెల్లి జగన్నాథం పాల్గొన్నారు.

పోషకాహార కిట్లు అందజేత

పోషకాహార కిట్లను అందజేస్తున్న అనురాధ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్షయవ్యాధి గ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వేసుకోవడంతో పాటు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అదనపు డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎన్.అనురాధ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, వరం ఛారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా క్షయవ్యాధి గ్రస్తులకు, వారి కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ కార్యాలయంలో పౌష్టికాహారం కిట్లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యసనాలను విడిచి తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధిని నయం చేసుకోవచ్చన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ క్షయవ్యాధితో బాధపడుతున్న రోగులకు మినిస్టర్ ఫర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సూచనల మేరకు పౌష్టికాహారం అందజేస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా 30 మంది టిబి బాధిత కుటుంబ సభ్యులకు బియ్యం, పప్పు దినుసులు, నూనె, పాలపొడి, దుప్పటి, ఇతర సామగ్రిని అందజేశామని అన్నారు. జిల్లాలో 2,380 మంది బాధితులను వైద్య ఆరోగ్యశాఖ గుర్తించిందని చెప్పారు. వారందరికీ దాతల సహకారంతో దశల వారీగా పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వరం ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు ప్రసాద్, సంతోష్, కెల్ల కిషోర్‌కుమార్, నిక్కు హరిసత్యనారాయణ, కె.సత్యనారాయణ, బి.చిన్మయరావు, బి.సతీష్, ఎం.కళ్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

ఎండల మల్లన్నకు యాత్రికుల తాకిడి

టెక్కలి రూరల్ : యాత్రికులతో కిటకిటలాడిన ఆలయం

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

మండలంలోని రావివలస ఎండల మల్లికార్జునస్వామి ఆలయానికి యాత్రికులు పోటెత్తారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో జిల్లా నుంచేకాక, ఒడిశా నుంచి వచ్చిన యాత్రికులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. సోమవారం వేకువజామున 3గంటల నుంచే యాత్రికులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల మంత్రోర్చనల మధ్య వందలాది మంది దర్శించుకున్నారు. యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవాదాయశాఖ అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. అయినా టిక్కెట్ల విక్రయ కౌంటరు, దర్శన క్యూలైనులో స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. పలు కూడళ్లలో ఉచిత ప్రసాద వితరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వార్డు మెంబర్ బమ్మిడి గురువునాయుడు ఆధ్వర్యంలో గోపినాథపురం సమీపంలోని పాత బస్టాండ్ వద్ద ప్రసాదం వితరణ చేపట్టారు. ఈ ఉత్సవాల్లో ఎండల మల్లిఖార్జున స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సూర్యనారాయణ, సిఐ చంద్రమౌళి యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.

ఘనంగా లక్ష దీపారాధన

హరిశ్చంద్రపురంలో లక్ష దీపారాధన

కోటబొమ్మాళి: మండలంలోని చిన్న హరిశ్చంద్రపురం గ్రామం శ్రీపంచరామక్షేత్రంలో కార్తీక నాల్గొవ సోమవారం సందర్భంగా లక్ష దీపారాధన ఘనంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకులు ఉప్పాడ కనకరాజు ఆధ్వర్యంలో వేద పండితులు బంకుపల్లి సుబ్రమణ్యశర్మ అధ్యక్షతన సమతానంద స్వామిజీ, నెల్లిమర్ల శ్రవణ చైతన్యానంద చిన్నస్వామిజీ అనుగ్రహ భాషాణం వారితో లక్ష దీపారాధన, లక్షబిల్వార్చన, మహారుద్రాభిషేకం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సుమారు 10వేల మంది మహిళలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తూర్పుగోదావరికి చెందిన సాధుప్రసాద్ వరేణ్యం ప్రవచనాలు బోధించారు.

కోటేశ్వర ఆలయంలో దశ సహస్ర రుద్రాక్ష అలంకరణ

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని నాగావళి తీరాన ఉన్న శైవ క్షేత్రం ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస నాలుగో సోమవారం పురస్కరించుకుని యాత్రికులు తరలివచ్చారు. ఇందులో భాగంగా అనువంశిక అర్చకులు ఆరవల్లి హరిగోపాలశర్మ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీరామ్మూర్తి శర్మ (రాంజీ), ఆరవెల్లి చంద్రశేఖర్‌శర్మ స్వామి 5,116 రుద్రాక్షలతో దశ సహస్ర రుద్రాక్ష అలంకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సుంకరి కృష్ణ, ఆలయ ఇఒ వి.రాధాకృష్ణ, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

కె.కొత్తూరులో అన్నదానం

టెక్కలి: కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా మండలంలోని కె.కొత్తూరులోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమండ్రికి చెందిన అష్టావధాని తాత సందీప్ శర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కమిటీ నిర్వహించిన అన్న సమారాధనలో సుమారు మూడువేల మంది యాత్రికులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో దిగుబడులు

కషాయం తయారు చేస్తున్న రైతులు

లావేరు: మండలంలోని లక్ష్మీనరసింహపురంలో రణస్థలం డివిజన్ ఎడిఎ శ్రీనివాసరావు, డిపిఎం రేవతి, లావేరు ఎఒ మహేష్‌నాయుడు ఆధ్వర్యాన 25 మంది రైతుతో సోమవారం కషాయం తయారు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్నలో కత్తెర పురుగును ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో నివారించేందుకు విషముసిడి కషాయం తయారు చేయించామన్నారు. ఒక ఎకరాకు కావాల్సిన పదార్థాలు కిలో పొగాకు, కిలో విషముసిడి చెక్క, అరకిలో వెల్లుల్లి, అరకిలో పచ్చిమిర్చి, 15 లీటర్ల నీటితో ఓ పాత్రలో బాగా వేడి చేయాలన్నారు. అందులో కిలో పొగాకు, కిలో విషము షిరిడి చెక్క, అరకిలో వెల్లుల్లి అరకిలో పచ్చిమిర్చి ముద్దలను వేసి మూడు, నాలుగు పొంగులు వచ్చేవరకు మరగబెట్టాలన్నారు. తరువాత 48 గంటల పాటు చల్లార్చి వడపోయాలని, అప్పుడు విషం కషాయం తయారవుతుందని అన్నారు. ఇలా తయారు చేసిన కషాయం ఎకరాకు సరిపడి నీటిలో కలుపుకుని పిచికారీ చేస్తే మొక్కజొన్నలో కత్తెర పురుగును సమర్థవంతంగా నివారించవచ్చునన్నారు. అలాగే మొక్కకు కావాల్సిన పోషకాలను అందించేందుకు 12 రకముల బ్యాక్టీరియాల మదర్ కల్చర్స్‌ను ఉపయోగించి జీవన ఎరువులు తయారు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో నేలను సారవంతం చేసి మొక్కకు కావాల్సిన పోషకాలను అందుబాటులోకి వచ్చి పంట బాగా ఎదుగుదలకు అవకాశం ఉంటుందన్నారు. తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో జీవన ఎరువులను తయారు చేసుకొని ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చునన్నారు. నేలనూ ఆరోగ్యకరంగా తయారు చేయవచ్చునని వివరించారు. కార్యక్రమంలో నేచురల్ ఫార్మింగ్ మాస్టర్ ట్రైనర్ ఎస్‌డిఎ గంట్యాడ రాంబాబు, సురేష్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ రైతు పిడుగు గోపాలరావు, యూనిట్ ఇన్‌ఛార్జి పైల రాంబాబు, పిడుగు సోమశేఖర్, కేలం అప్పారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేయాలి

వెలుగు ఎపిఎం ప్రసాదరావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

గొర్రెలు, పెరటి కోళ్లు, ముర్రా జాతి చూడి గేదెలు, హర్యానా ఆవులతో కూడిన యూనిట్లకు లబ్ధిదారులను గుర్తించి, వారి వివరాలు అందజేయాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు సూచించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం గ్రామ సంఘ నాయకులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ 18 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండి, బ్యాంకుఖాతా కలిగిన లబ్ధిదారులకు పిఎంజెజెబివై, ఎస్‌బివై కింద ప్రీమియం చేయించుకోవచ్చని తెలిపారు. అనంతరం మనబడి నాడు-నేడు పాఠశాలల అభివృద్ధి పనులు, మధ్యాహ్న భోజన పథకం, పారిశుధ్యం, తదితర అంశాలపై చర్చించారు.

వైఎస్‌ఆర్ చేయూత లబ్ధిదారులు చేస్తున్న వ్యాపారాలకు సంబంధించి ఆన్‌లైన్ అప్‌డేట్ చేయాలని సూచించారు. ఉన్నతి రుణాలు పొందిన ఎస్‌సి, ఎస్‌టిల ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల ఫొటోలతో సహా లోన్ రిక్వెస్ట్ పెట్టడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జగనన్న తోడు, పేదలకు ఇళ్ల రుణాలు అందించడానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎ.రామకృష్ణ, డి.మోహన్‌రావు, హౌసింగ్ సోషల్ స్పెషలిస్టు అధికారి సిహెచ్ మల్లేశ్వరరావు, కె.మోహిని, అకౌంటెంట్ పి.విష్ణుబాబు, మండల సమైక్య అధ్యక్షులు కె.పార్వతి, 35 గ్రామ సంఘాల విఒఎలు, తదితరులు పాల్గొన్నారు.

జీవరాశుల మనుగడకు మొక్కలు దోహదం

ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రజాశక్తి- పొందూరు

జీవరాసుల మనుగడకు మొక్కలు దోహదపడతాయని తోలాపి జెడ్‌పిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు పూజారి రవి, జీవశాస్త్ర ఉపాధ్యాయులు రాజసుందరి అన్నారు. మండలంలోని తోలాపిలో సోమవారం గ్లోబల్ వార్మింగ్‌పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ కారణంగా భూమిపై జీవులకు ప్రమాదఘంటికలు మోగుతున్నాయని, భూమిపై జీవరాశి మనుగడ సాగించాలంటే భూమిని పరిరక్షించుకోవాలని అన్నారు. భూమిపై చెట్లు నరికివేత కారణంగా విపరీతంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయన్నారు. విపత్తులు సంభవించకుండా చూడాలంటే గ్లోబల్ వార్మింగ్ తగ్గించాలని, దీనికి మొక్కలు నాటడమే పరిష్కారమని అన్నారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మొక్కలను పంచిపెట్టారు. ర్యాలీలో ఉపాధ్యాయులు విశ్వేశ్వరరావు, గోవిందరావు, శ్రీనివాసరావు, రాధాకృష్ణ, గణపతి పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన యుగంధర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ బిసి సెల్ సోసల్ మీడియ కో-ఆర్డినేటర్‌గా నియమితులైన బుక్కా యుగంధర్ ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మదేవిలను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వారి క్యాంపు కార్యాలయాలకు వెళ్లి పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో పార్టీ సోషల్ మీడియా విభాగాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. పార్టీతో పాటు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికార వైసిపి చేపడుతున్న ప్రజావ్యతిరేక కార్యకలాపాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కోశాధికారి ఇప్పిలి తిరుమలరావు పాల్గొన్నారు.

స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న సూర్యప్రకాష్

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రెటరీ గోవిందరాజుల శ్రీనివాస్ అయ్యంగార్, చండీఘడ్ ఐజి కె.వి.రాఘవాచార్యులు సోమవారం సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామి వారికి నిర్వహించే సేవల్లో పాల్గొన్న వారికి అనివేటి మండపంలో స్వామివారి శేషవస్త్రాలను కప్పి జ్ఞాపికలను ఇఒ వి.హరిసూర్యప్రకాష్ అందజేశారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

పొందూరు : మండలంలోని లోలుగు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఇఇ ఎస్.భయ్యన్ననాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామస్తులు, విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

దుకాణాల్లో దాడులు చేస్తున్న కమిషనర్ రాజగోపాల్

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు

పలాస: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్లాస్టిక్ వాడితే కఠినంగా చర్యలు ఉంటాయని పలాస మున్సిపల్ కమిషనర్ టి రాజగోపాల్ వ్యాపారస్తులకు హెచ్చరించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పరిధిలో సచివాలయ సిబ్బందిని రెండు బృందాలుగా విభజించి 54 దుకాణాల్లో సోమవారం దాడులు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న వారి నుంచి రూ.8600లు అపరాధ రుసుం వసూలు చేసినట్లు కమిషనర్ తెలిపారు. కేవలం 19 దుకాణాల్లో ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా ప్లాస్టిక్ కవర్లను ఉపయోగిస్తున్నారని చెప్పారు. ఆయనతోపాటు శానిటేషన్ ఇన్స్పెక్టర్, మున్సిపల్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జలకలింగుపురంలో పర్యటిస్తున్న జనసేన నాయకులు

జనసేన నాయకుల పర్యటన

మెళియాపుట్టి: జనసేన పార్టీని ప్రతిఒక్కరూ ఆదరించాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గేదెల చైతన్య కోరారు. మండలంలోని మర్రిపాడు-సి పంచాయతీలో జలకలింగుపురం, సవరమర్రిపాడులో సోమవారం ఇంటింటికీ వెళ్లిజనసేన పార్టీ సిద్ధాంతాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ తన సొంత కష్టంతో సంపాదించిన డబ్బులను కౌలు రైతుకు రూ.లక్ష చొప్పున రూ.30 కోట్లపైగా ఖర్చు చేశారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు దుక్క బాలరాజు, కురామన పాపారావు యాదవ్, రాణా జనార్ధనరావు, మణికంఠ, హరికృష్ణ పాల్గొన్నారు.

ధ్రువపత్రాలను చూపిస్తున్న రైతులు

ఈ-పంట ధ్రువపత్రాలు పంపిణీ

ఇచ్ఛాపురం: మండలంలో ఈ-పంట నమోదు ధ్రువపత్రాలను రైతులకు అందించినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీదేవి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈ ధ్రువపత్రాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఖరీఫ్‌లో పంటల నమోదు చేసుకున్నట్లు ఈ పత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. తులసిగాంలో రైతులకు వీటిని అందించినట్లు చెప్పారు. ఆమె వెంట వ్యవసాయ సహాయకులు శిరీష, రైతులు ఉన్నారు.